సాక్షి
వికారాబాద్
సోమవారం, 9, డిసెంబర్, 2024



హామీలు అమలు చేశాం

ఇచ్చిన హామీలు అమలు చేశామని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదంటూ ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. 8లో▸



ప్రజా విజయోత్సవాలు

కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి కావడంతో వారం రోజుల పాటు ప్రజా విజయోత్సవాలు అట్టహాసంగా నిర్వహించింది. 9లో▸

న్యూస్‌రీల్

నేడు పార్ట్‌టైం లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతగిరి: జిల్లాలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో పార్ట్‌టైం లెక్చరర్లకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీసీఓ సాయిలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బోటనీ, మ్యాథ్స్(జేఎల్), సోషల్, ఇంగ్లిష్(పీజీటీ), సోషల్, ఫిజికల్ సైన్స్(టీజీటీ)లో అవకాశం ఉన్నాయని ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 10గంటలకు కొత్తగడి గురుకుల పాఠశాలలో సంబంధిత సర్టిఫికెట్స్‌తో హాజరవ్వాలన్నారు. వివరాలకు 9704550229 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ధర్మాగ్రహ దీక్షకు తరలిరండి

తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య

బొంరాస్‌పేట: ధర్మాగ్రహ దీక్షకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పీఆర్‌సీ, డీఏలు, పెండింగ్ బిల్లుల పరిష్కారం కోసం తపస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 10గంటలకు హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద ధర్మాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, రాష్ట్ర కార్యదర్శి కరణం లక్ష్మీకాంతరావు, జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో పీఆర్‌సీ కమిటీ నివేదిక, నాలుగు డీఏలు, పెండింగ్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విడుదల చేయాలన్నారు. సర్వే, డాటా వంటి బోధనేతర పనులను తిరస్కరిస్తున్నామన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు



మాట్లాడుతున్న రాములు

కొడంగల్ రూరల్: నియోజకవర్గ కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనాల్ రాములు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో రజక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో రజకులు ఎదిగేందుకు సంఘటితంగా కృషిచేయాలని అన్నారు. అవసరమైన చోట దోబీఘాట్‌ల నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, నీటి కొరకు బోరులను వేయించాలని కులవృత్తి దారులకు ప్రభుత్వం చేయూతనందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య వెంకటయ్య, అంజయ్య, రజక సంఘం మండల గౌరవ అధ్యక్షుడు చంద్రప్ప, సభ్యులు పకీరప్ప, నాగప్ప, దౌల్తాబాద్ మల్కప్ప, అన్నారం వెంకటయ్య, ఎల్లప్ప, సుందరప్ప, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యూచర్' రోడ్డుకు భూములిచ్చేది లేదు

స్పష్టం చేసిన భూ బాధితులు



రాచులూరులో సమావేశమైన రైతులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులు ఆదివారం మండల పరిధిలోని రాచులూరులో సమావేశమయ్యారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న కొంగర, తిమ్మాపూర్, అగర్‌మియాగూడ, లేమూరు, రాచులూరు, బేగంపేట, తుర్కగూడ తదితర గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యారు. తమ భూములు రోడ్డుకు ఇచ్చేదిలేదని తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఉన్న శ్రీశైలం రహదారితో పాటు ఎలిమినేడు నుంచి తిమ్మాపూర్ మీదుగా ఒక రోడ్డు, గతంలో ఫార్మాసిటీ కోసం నిర్మించిన మరో రహదారి అందుబాటులో ఉండగా మళ్లీ కొత్తగా రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. పంటలు పండే భూములను తీసుకుని రోడ్డు నిర్మిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేకంగా పోలీసు బలగాలతో పట్టా భూముల్లో సర్వే చేయడంతో పాటు మట్టి పరీక్షల కోసం డ్రిల్లింగ్ పనులు చేయడం ఏమిటని నిలదీశారు. దీన్ని వ్యతిరేకిస్తున్న తమపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారని, ఎటి పరిస్థితుల్లోనూ తమ భూములు ఇచ్చేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు డి.సుధాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌చారి, జంగయ్య, యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళారులే దిక్కు..!

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఊసెత్తని ప్రభుత్వం

- పంట సమాచారం సేకరించామంటున్న మార్క్‌ఫెడ్ అధికారులు
- జిల్లాలో 46వేల ఎకరాల్లో సాగు
- 87వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- మద్దతు ధర రూ.2,225



వికారాబాద్ సమీపంలో ఆరబెట్టిన మొక్కజొన్నలు

వికారాబాద్: సీజన్ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత ఇవ్వడం లేదు. ఏటా ఇప్పటికే కేంద్రాలు ప్రారంభమయ్యేవి. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారా..? లేదా అనే విషయం తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 46 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. సాగు వివరాలు.. ఏ మేరకు దిగుబడి వస్తుంది.. అనే పూర్తి వివరాలు సేకరించామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని మార్క్ ఫెడ్ అధికారులు అంటున్నారు. కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత లేకపోవడంతో పంట దిగుబడి అమ్ముకోవడం రైతులకు కష్టంగా మారింది. నెల రోజులుగా పంట ఉత్పత్తి మార్కెట్‌కు చేరుతోంది. ప్రతి వారం ధరలు తగ్గుముఖం పట్టడం రైతులను కలవర పెడుతోంది. దీంతో మక్కలు విక్రయించాలా.. మద్దతు ధర వచ్చేవరకు నిల్వ చేయాలా అనే ఆలోచనలో పడ్డారు.

ధరలు పతనం

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్, ధారూరు, మర్పల్లి తదితర మార్కెట్లకు ప్రతి వారం 5వేల నుంచి 8వేల క్వింటాళ్ల మొక్క జొన్నలు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో ధరలు భారీగా పడిపోతున్నాయి. నెల రోజుల క్రితం వరకు క్వింటాలు మక్కలకు రూ.2,600 పలకగా ప్రస్తుతం రూ.2వేల నుంచి రూ.2,200 వరకు ధర పలుకుతోంది. 2024–25 సీజన్‌కు గాను ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225గా నిర్ణయించారు. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులు, ఓపెన్ మార్కెట్‌లో విక్రయిస్తూ నష్టపోతున్నారు. క్వింటాలుకు రూ. 200 నుంచి రూ. 300 వరకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకాల్లో కూడా మోసం చేస్తున్నారని వాపోతున్నారు. వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేసి మక్కలు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 46వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన 87 వేల మెట్రిక్ టన్నుల దిగబడి రానుందని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో మొక్కజొన్నలు ప్రైవేటు వ్యక్తులే కొనుగోలు చేయాల్సి వస్తే మాత్రం ధరలు మరింత పతనమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు తీవ్రనష్టం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవటం, మార్కెట్‌లో ధరల ఒడిదుడుకులు కొనసాగుతుండటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిళ్లుతోంది. ప్రభుత్వం క్వింటాలు మక్కలకు రూ.2,225 మద్దతు ధర నిర్ణయించింది. వ్యవసాయ మార్కెట్లలో తేమ తదితర కారణాలు చూపి తక్కువ ధరలకు మక్కలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. సీజన్ దాటిక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండదని రైతులు అంటున్నారు. కొందరు దళారులు పొలాల వద్దే మక్కలు కొనుగోలు చేస్తున్నారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

ఆరు గ్యారంటీల అమలుకు పనిచేస్తున్నాం

- ప్రజాపాలన విజయోత్సవాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిరుపేదలకే ప్రాధాన్యమిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని కందనెల్లి, ఖానాపూర్, రుక్మాపూర్, రేగోండి, కొండాపూర్, దుగ్గపూర్, మారెపల్లితండా, మంబాపూర్, జనగాం, మారెపల్లి, మంచన్‌పల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తోందన్నారు. సంక్రాంతి తర్వాత రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా పథకం అమలు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక దళిత, గిరిజనులతో పాటు ఇళ్లులేని వారికి మొదటి ప్రాధాన్యత కల్పించాలని ఆదేశించారు. అనంతరం మంబాపూర్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం కందనెల్లి శివారులోని విద్యుత్‌సబ్‌స్టేషన్ పనులను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ధారాసింగ్, తాండూరు, కోట్‌పల్లి ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు బాల్‌రెడ్డి, అంజయ్య, నారాయణరెడ్డి నాయకులు శోభారాణి, మధులత, గోపాల్, రియాజ్, లొంక నర్సింలు, ఎల్లారెడ్డి, జితేందర్‌రెడ్డి, మల్లేశం, మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, డీవై నర్సింలు, రవిశంకర్, గోపాలకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఢీ అంటే ఢీ!

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- లగచర్ల ఘటన, గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డుకు భూ సేకరణ..
- హైడ్రా కూల్చివేతలు, బీజాపూర్‌రోడ్డు విస్తరణ..
- రుణమాఫీ అంశాలను ప్రస్తావించనున్న బీఆర్ఎస్
- విమర్శలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా అధికార పార్టీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జిల్లాలో రాజకీయ వేడిని పుట్టించనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాలోని ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏవిధంగా స్పందిస్తారనే దానిపై ఉమ్మడి జిల్లాలో వాడీవేడి చర్చ సాగుతోంది. తమ సమస్యలను శాసనసభ, మండలిలో సభ్యులు ప్రస్తావిస్తారా.. లేదా మౌనం వహిస్తారా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు స్థానికంగా వివాదాస్పదమైన ఫార్మాసిటీ కోసం లగచర్లలో చేపట్టిన భూసేకరణ అంశం, ఫోర్త్‌సిటీ విస్తరణ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం చేపట్టిన భూసేకరణ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, హైడ్రా దూకుడు, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్ల కూల్చివేత, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, శివారులో ఐటీ విస్తరణ, కొత్త పరిశ్రమలు, ధరణి సమస్యలను ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ లేవనెత్తే అవకాశం ఉంది. ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టేందుకు అధికారపార్టీ ఎమ్మెల్యేలు కూడా వ్యూహాత్మకంగా ఎత్తుకు పైఎత్తులతో సిద్ధమవుతున్నారు.

అస్త్రశస్త్రాలు సిద్ధం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 17 మంది శాసనసభ్యులు, ఐదుగురు శాసన మండలి సభ్యులు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ సహా మహేశ్వరం, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. వీరిలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బీఆర్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కొడంగల్ సహా వికారాబాద్, పరిగి, తాండూరు, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం కల్వకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు శాసన సభ, శాసన మండలి వేదికగా తమ గళాన్ని విప్పేందుకు సిద్ధం అవుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిలదీయనుండగా, వారి విమర్శలను అదేస్థాయిలో తిప్పికొట్టేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు వ్యూహాలు రచిస్తున్నారు.

ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలివే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మాకంపెనీల ఏర్పాటుకు దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల్లో 1,375 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఇటీవల కలెక్టర్ సహా ఇతర అధికారులు లగచర్లకు వెళ్లడం.. భూ బాధితులు అధికారులపై తిరగబడటం.. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడం విదితమే. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా అనేక మంది రైతులను అరెస్టు చేసి, జైల్లో పెట్టడాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రధానంగా ప్రస్తావించనుంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా 30 వేల ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఫోర్త్‌సిటీ, 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం రైతుల నుంచి బలవంతపు భూ సేకరణ అంశం సహా మూసీ ప్రక్షాళన పేరుతో రాజేంద్రనగర్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో పేదల ఇళ్ల కూల్చివేత అంశాన్ని బీఆర్ఎస్ సహా బీజేపీ ఎమ్మెల్యేలు ప్రధానంగా లేవనెత్తనున్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు బీజాపూర్ రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం, ఇటీవల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టాల అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం లేకపోలేదు. మున్సిపాలిటీల్లో శివారు గ్రామాల విలీనం అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అధికార పార్టీ అస్త్రాలివే..

ముచ్చర్ల ఫార్మాసిటీ కోసం బీఆర్ఎస్ హయాంలో అడ్డగోలుగా చేపట్టిన భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపులో చోటు చేసుకున్న అక్రమాలు, ధరణి సాంకేతిక పరిజ్ఞానంలో లోపాలు, జీఓ నంబర్ 58, 59 పేరుతో నాటి అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వైనాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా ప్రస్తావించనుంది. బీఆర్ఎస్ నేతల ఆక్రమణలు, అధికారిక నిర్మాణాలు, ఫాంహౌస్‌ల్లో విందులు, డ్రగ్ కేసుల వంటి అంశాలను తెరపైకి తీసుకొచ్చి ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టనుంది. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, రైతు రుణ మాఫీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే గృహాలకు ఉచిత విద్యుత్ పథకం, వరి ధాన్యం కొనుగోలు, బోనస్, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా ఫోర్త్‌సిటీ పేరుతో అత్యాధునిక నగరం ఏర్పాటు, స్కిల్ యూనివర్సిటీ, యువతకు నైపుణ్య కల్పన, ఏటీసీ, స్పోర్ట్స్ హబ్‌ల ఏర్పాటు వంటి అభివృద్ధి అంశాలను ప్రధానంగా ప్రసావించనుంది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల విమర్శలను తిప్పి కొట్టేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం అదే స్థాయిలో సిద్ధం అవుతున్నారు.

అంబేడ్కర్ నేటి తరానికి స్ఫూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అంబేడ్కర్ సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని.. ఆయన నేటి తరానికి స్ఫూర్తి అని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని ఖుదావన్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నిర్వాహకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ నెల 14న పట్టణ కేంద్రంలో నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే నివాసంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని పరిష్కరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

దోమ: ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తవప్పని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన దోమ ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆస్పత్రి పరిసరాలు, స్టోర్ రూంను పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో మండల వైద్యాధికారి రజితకు ఫోన్ చేయగా తాను సెలవులో ఉన్నానని చెప్పింది. దీంతో ఆయన జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో రోగులు వేచి ఉండగా వైద్యులు, సిబ్బంది లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సబ్ సెంటర్లలోనూ వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సైతం మధ్యాహ్నానికి ఆస్పత్రి మూసి వేస్తున్నారని మండి పడ్డారు. వైద్యులు, సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఫోన్‌లో డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉప్పల్ భగాయత్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



హెచ్ఎండీఏ కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ భగాయత్‌లో అక్రమ నిర్మాణాలపై హెచ్ఎండీఏ కొరడా ఝళిపించింది. ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ స్థలాల్లో కొందరు అక్రమంగా నిర్మాణాలు కొనసాగిస్తున్న వైనంపై ఈ నెల 2న 'జాగాలో పాగా' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి హెచ్ఎండీఏ అధికారులు స్పందించారు. ఉప్పల్ భగాయత్‌లోని తూర్పు వైపు సుమారు 150 గజాల స్థలంలో అక్రమంగా నిర్మించిన రెండు గదుల ఇంటిని కూల్చివేశారు. లే అవుట్‌లోని వివిధ ప్రాంతాల్లో మిగిలిపోయిన స్థలాలకు రక్షణ లేకుండా పోయింది. కొందరు వ్యక్తులు షెడ్లు వేసి అద్దెలకిస్తున్నారు. అక్రమార్కులపై అధికారులు శాశ్వత చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడే అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటున్నారని, ఆ తర్వాత యథావిధిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 'సాక్షి' కథనంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రారండోయ్ వేడుక చూద్దాం



- నేడు ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు
- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ
- ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రోన్ షో
- పెద్ద ఎత్తున బాణసంచా ప్రదర్శన
- సంగీత దర్శకుడు తమన్ నేతృత్వంలో కచేరీ

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మూడు రోజులు పాటు ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ముగింపు వేడుకల సందర్భంగా సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలతో భారీ బహిరంగ సభ జరగనుంది. సాయంత్రం 7.30 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రోన్ ప్రదర్శన, హుస్సేన్ సాగర్‌లో పెద్దఎత్తున బాణసంచా ప్రదర్శన, అనంతరం హెచ్ఎండీఏ మైదానంలో తమన్ నేతృత్వంలో సంగీత కచేరీ, సాంస్కృతిక ప్రదర్శన ఉంటుంది. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులో ఫుడ్‌స్టాళ్లతో పాటు హస్తకళల, సాంస్కృతిక, పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేశారు.

బహు పసందుగా ఫుడ్ స్టాళ్లు

ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లలోని పలు పసందైన వంటకాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. నగరంలో ప్రసిద్ధి చెందిన పలు బ్రాండెడ్ హోటల్స్ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. హైదరాబాదీ బిర్యానీ, మొఘలాయి, తెలంగాణ, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరీ ఐటమ్స్ చాట్, ఐస్‌క్రీం.. ఇలా వందకు పైగా ఫుడ్‌స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు తెలంగాణ వంటకాలు పాలమూరు గ్రిల్, తెలంగాణ విందు, అంకాపూర్ నాటుకోడి చికెన్, ఫుడ్ జాయింట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా నగరమంతా విద్యుత్ దీపాలంకరణతో జిగేమంటోంది. డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయం, పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో తళుక్కుమంటున్నాయి.

క్లుప్తంగా

నవోదయ పాఠశాల మంజూరు చేయండి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి ఏడు నవోదయ పాఠశాలలు మంజూరు చేసినప్పటికీ అందులో వికారాబాద్ జిల్లా లేకపోవడం శోచనీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం జిల్లాకు మొండి చేయి చూయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వికారాబాద్ జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరు చేయించాలని ఆయన కోరారు.

పాత విగ్రహాన్నే ఏర్పాటు చేయాలి

కుల్కచర్ల: తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర ఇబ్బందికరంగా ఉందని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అనుకూల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే తెలంగాణ తల్లి రూపాన్నే మార్చాలని ప్రయత్నిస్తుందన్నారు. గత తెలంగాణ తల్లి విగ్రహానికి తలకు కిరీటం, బంగారు గాజులు, వెండి మెట్టెలు, కుడి చేతిలో మక్క కంకులు, ఎడమ చేతిలో బతుకమ్మతో రాజమాతలా కనిపించేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటు చేస్తున్న నూతన తెలంగాణ తల్లి విగ్రహానికి సాధారణ మహిళా రూపాన్ని తలపిస్తుందన్నారు. పాత విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మొయినాబాద్: హిమాయత్‌సాగర్ చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం లేక్ పోలీసులు మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా హిమాయత్‌సాగర్ చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని గుర్తించారు. నీటిలో తేలుతూ శవం కనిపించడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. వారం రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుని ఒంటిపై బ్లూ కలర్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రావిర్యాల చెరువులో...

ఇబ్రహీంపట్నం రూరల్: రావిర్యాల చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఆదివారం చెరువులో గుర్తు తెలియని మృతదేహం తేలియాడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడి వయసు 20–25 సంవత్సరాలు ఉన్నట్లు భావిస్తున్నారు. నలుపు, తెలుపు రంగులో ఉన్న షార్టు, ముదురు ఆకుపచ్చ టీ షర్టు కలిగి ఉన్నాడన్నారు. చేయి మీద శ్రీ అనే అక్షరం పచ్చ బొట్టు ఉందని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మరణించినట్లు, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు


జ్యోతిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

శంకర్‌పల్లి: మండల ంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన మరకత శివాలయాన్ని ఆదివారం రంగారెడ్డి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతిరెడ్డి, రఘురాంరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం లింగానికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు దంపతులకు ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరకత శివుడిని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సభ్యులు హనుమంతు, దర్శన్, శేఖర్‌రెడ్డి, పూజారి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి.. ఆహ్లాద కడలి


ప్రాజెక్టు అలుగుపై సెల్ఫీ తీసుకుంటున్న యువత

సెలవుదినం వచ్చిందంటే కోట్‌పల్లి ప్రాజెక్టుకు వేల సంఖ్యలో పర్యాటకులు చేరుకుని సేద తీరుతున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ప్రాజెక్టు సమీప ప్రాంతాలు కళకళలాడాయి. కుటుంబసభ్యులతో చేరుకొని బోటింగ్ చేసి ఎంజాయ్ చేశారు. యువతీ, యువకులు ప్రాజెక్టు అలుగుపై చేరి కేరింతలు కొడుతూ సెల్ఫీలకు ఫోజులిచ్చారు. – ధారూరు


బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పల్లె వైద్యం.. వసతులు దైన్యం

- ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు కరువు
- సిబ్బందిపై కొరవడిన పర్యవేక్షణ
- ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజలు



మాటూరులో కమ్యూనిటీ భవనంలో కొనసాగుతున్న ఆరోగ్య ఉపకేంద్రం

దౌల్తాబాద్: పల్లెల్లో ప్రజారోగ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆరోగ్య కేంద్రాల్లో వసతులు లేక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో ఆరోగ్య ఉపకేంద్రాలు తొమ్మిది ఉండగా ఇందులో 7 ఉపకేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. అరకొర వసతులతో వైద్యులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు.

వైద్యం కోసం పట్టణాల బాట

మండలంలో గ్రామీణులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారింది. భిన్నమైన వాతావరణ పరిస్థితుల కారణంగా దగ్గు, జలుబు, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో పల్లె జనాలకు వైద్య సేవలు అందించే ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో గ్రామీణులు వైద్యం కోసం పట్టణాల బాట పడుతున్నారు. ఉపకేంద్రాల్లో సిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతో పాటు సొంత భవనాలు లేకపోవడంతో గ్రామీణులు వైద్యం కోసం ఆర్‌ఎంపీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సరైన సేవలు అందడం లేదు. మండలంలో 9 ఉపకేంద్రాలకుగాను 7 అద్దె భవనాలు, పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి.

లక్ష్యం నీరుగారి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పింది. పీహెచ్‌సీ పరిధిలోని కొన్ని గ్రామాలను కలిపి ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజలకు అత్యవసర ప్రాథమిక వైద్యసేవలు అందించాలని సంకల్పించారు. ఘనమైన ఆశయంతో ఏర్పాటు చేసిన ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేక అలంకారప్రాయంగా మారాయి. సిబ్బంది స్థానికంగా ఉండకపోవడం, నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవవడంతో రోగులకు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి.

వసతులు లేని అద్దె కేంద్రాలు

ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేని చోట పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగిస్తున్నారు. అక్కడ వెలుతురు, తాగునీరు, ఇతర సౌకర్యాలు లేని గదులు లభిస్తుండడంతో ప్రతి వారం పరీక్షల కోసం వచ్చే గర్భిణులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్య సామగ్రి రికార్డులు ఇతర పరికరాలు ఉంచేందుకు స్థలం లేక రోగులు సతమతమవుతున్నారు. సిబ్బంది ఉండేందుకు సరైన వసతి లేకపోవడంతో గ్రామీణ వైద్యం దయనీయంగా మారింది.

నిధులు కేటాయించాలి

ఉపకేంద్రాల్లో అత్యవసర మందులతో పాటు జ్వరం, దగ్గు, విరేచనాలు, వాంతులు లాంటి జబ్బులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు బీపీ పరీక్ష యంత్రం, బరువు తూగే యంత్రం అందుబాటులో ఉంటాయి. ఆరోగ్య ఉపకేంద్రాల్లో సౌకర్యాలు లేనందున రోగులు రావడానికి ఆసక్తి చూపడంలేదు. ఇరుకు గదుల కారణంగా మందులు నిల్వ చేసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాల కోసం నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేశాం


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఇచ్చిన హామీలు అమలు చేశామని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినందుకు నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉమ్మడి ఘట్‌కేసర్, కీసర మండలాలకు చెందిన 407 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఘట్‌కేసర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేశామని, ఏవైన పెండింగ్‌లో ఉంటే పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేస్తామని, తెలంగాణలో ప్రతి మండలంలో చెక్కులు అందజేస్తున్నామన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీల అమలులో ఆటంకాలు ఎదురైన వెనకడుగు వేసేది లేదని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్లు పావనీజంగయ్య, ప్రణీతగౌడ్, చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, తహసీల్దార్లు రజని, హసీనా, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణము దిరాజ్, జంగయ్యయాదవ్, కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్


సెల్‌టవర్‌పై ఆటో డ్రైవర్ అంజి

భార్య కాపురానికి రాలేదని పురుగుల మందు తాగి ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

తాండూరు టౌన్: భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదంటూ ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు నచ్చజెప్పి ఎట్టకేలకు అతన్ని కిందకు దింపారు. వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం దామర్‌చేడ్ గ్రామానికి చెందిన అంజి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మూడు రోజుల క్రితం లక్ష్మి పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రమ్మంటే రావడం లేదని మనస్తాపంతో పురుగు మందు తాగి, సెల్ టవర్ ఎక్కాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. స్థానికులు, పోలీసులు రెండు గంటల పాటు అతనికి నచ్చజెప్పారు. ఎట్టకేలకు సెల్ టవర్ నుంచి కిందికి దిగాడు. తన భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదనే ఆత్మహత్యాయత్నం చేశానని తెలిపాడు. వెంటనే పోలీసులు అతన్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. మద్యానికి బానిసై ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ భార్యతో తరచూ గొడవపడుతున్నాడని, అందుకే ఆమె పుట్టింటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అంజి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు చెప్పారు.



అంబులెన్స్‌లో ప్రసవం

కేశంపేట: అంబులెన్స్‌లో ఓ గర్భిణి పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన శిరీష పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. వెంటనే అంబులెన్స్‌ను ఆపి కుటుంబ సభ్యుల సహకారంతో ఈఆర్‌సీపీ డాక్టర్ మనిష్, ఈఎంటీ సురేష్, పైలెట్ దీపక్‌లు ఆమెకు సుఖ ప్రసవం చేశారు. శిరీష పండటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నంబర్ ప్లేట్ లేకపోతే చర్యలే

మణికొండ: వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోతే చర్యలు తప్పవని నార్సింగి ట్రాఫిక్ ఎస్సై రాజేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం నార్సింగి సర్కిల్‌లో నంబర్ ప్లేట్ లేని, అక్షరాలు కనబడని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పట్టుబడిన 20 ద్విచక్ర వాహనాలకు చలాన్‌లు విధించి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయటంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై చందర్, కానిస్టేబుళ్లు సురేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో కార్మిక రంగం

శంషాబాద్: ప్రభుత్వాల తీరుతోనే వ్యవసాయ కార్మిక రంగం సంక్షోభంలోకి నెట్టబడుతోందని భారతీయ బీకేయూఎం జాతీయ కార్యదర్శి నిర్మల్ పాండే అన్నారు. ఆదివారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల్లో కులమతాల చిచ్చురేపడంతో వారి ఐక్యతను దెబ్బ తీస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో మైనార్టీలు, దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. బీకేయూఎం ద్వారా దేశ వ్యాప్తంగా పోరాటలను ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 27 కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, సృజన్‌కుమార్, యేసయ్య, బుద్దుల జంగయ్య, పుస్తకాల నర్సింగ్‌రావు, అంజయ్య, నర్రగిరి పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

రాజేంద్రనగర్: ఓ గృహిణి అదృశ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి ప్రాంతానికి చెందిన రుక్కన్న, పద్మ (35) దంపతులు. బతుకుతెరువు కోసం కిస్మత్‌పూర్ ప్రాంతానికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 7న ఇరువురి నడుమ గొడవ జరిగింది.కాసేపటి తర్వాత ఇంటి నుండి బయటికి వెళ్లిన పద్మ ఎంతకీ తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీఎం కప్'తో ప్రతిభ వెలికితీత


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఉత్సాహం చూపిస్తున్న పల్లె ప్రాంతాల క్రీడాకారులు

- జనవరి 2 వరకు సాగనున్న క్రీడలు

దుద్యాల్: గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం–కప్ ఉపయోగపడుతుందని పల్లె ప్రాంతాల్లోని క్రీడాకారులు అంటున్నారు. సీఎం కప్ పేరుతో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షూటింగ్, అథ్లెటిక్స్, యోగా తదితర 36 రకాల క్రీడలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌లు చేసుకుని సంబంధిత క్రీడా అధికారులను సంప్రదిస్తున్నారు. ఈ పోటీలు గ్రామస్థాయిలో రాణించిన వారు మండల స్థాయికి, మండలంలో ప్రతిభ చూపినవారికి జిల్లా స్థాయిలో అక్కడ నుంచి రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశంక ల్పిస్తున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ చేసే సమయంలో సర్వర్ సతాయిస్తుండడంతో ప్రభుత్వం అప్లికేషన్ నమోదు తేదీని ఈ నెల 10వరకు పెంచింది.

క్రీడల నిర్వహణ వివరాలు

మండల స్థాయి	ఈ నెల 10, 11, 12
జిల్లా స్థాయి	ఈ నెల 16 నుంచి 21వరకు
రాష్ట్రస్థాయి	ఈ నెల 27 నుంచి జనవరి 2వరకు

నమోదు చేసుకున్నా



పాఠశాల విడిచిన తర్వాత క్రీడలకు ఒకింత దూరం అవుతాం. సీఎం కప్ క్రీడల ద్వారా తమలాంటి క్రీడాకారులకు మరో అవకాశం లభించింది. ప్రతిభ ఉంటే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాణించవచ్చు. కబడ్డీ పోటీలకు అప్లికేషన్ చేసుకున్నా.
– ఆకాశ్, డిగ్రీ మొదటి సంవత్సరం

మంచి వేదిక



సీఎం కప్ ద్వారా క్రీడలు నిర్వహించడం గ్రామీణ క్రీడకారులకు వరం. చాలా మందికి వేదిక లేక ప్రతిభ ఉన్నప్పటికీ ముందుకు వెళ్లలేకపోతున్నారు. తమలాంటి వారికి ఇది మంచి అవకాశం. కబడ్డీ పోటీలకే పేరు నమోదు చేసుకున్నా.
– శేఖర్, క్రీడాకారుడు

పత్తి రైతుపై వర్షం పిడుగు


ఎన్కేపల్లిలో పొలంలో వర్షానికి తడిసిన పత్తి

మోమిన్‌పేట: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరతతో ఇంకా పొలాల్లోనే పత్తి ఉండటంతో అకాల వర్షాలు పత్తి నాణ్యతపై దెబ్బ తీస్తాయని రైతులు వాపోతున్నారు. పూత, కాయ దశలో ఎడ తెరిపి లేని వర్షాలతో దిగాలు పడ్డాడు. అరకొర కాపు వచ్చిన విత్తు నిండుగా గట్టి పడకపోవడంతో తూకం లేదని కూలీలు పత్తి తీతకు ఎక్కువ కూలీ డిమాండు చేశారు. కిలో రూ.15ల నుంచి రూ.20ల వరకు తీసుకున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురవడంతో ఏమి చేయాలో తెలవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వర్షాలు పడిన తర్వాత తీసిన పత్తికి ధర తక్కువగా చెల్లిస్తారని పేర్కొంటున్నారు. ఏ విధంగా చూసిన ఈసారి పత్తి సాగు చేసిన రైతు దివాల తీశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టినా దిగుబడి రాకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామంటున్నారు. అదే విధంగా అకాల వర్షాలతో ఉల్లి నారు కుళ్లి పోతుందన్నారు.

'వీర్లపల్లి'ని దూషిస్తే ఊరుకోం


సమావేశానికి హాజరైన బీసీసేన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాలకు చెందిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను దూషిస్తే చూస్తూ ఊరుకోం అని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పోలీసులు, జర్నలిస్టులను కులాల వారీగా ప్రజలను ఇష్టానుసారంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కుటుంబం పదేళ్ల పాలనలో ఎంత అరాచకం చేశారనే సందర్భంలో మాట్లాడిన మాటలను వక్రీకరించి ఎమ్మెల్యే శంకర్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కుల వృత్తులు మర్చిపోయి కంప్యూటర్లను పట్టుకునే రోజులు వచ్చినా గొర్లు, బర్లు, ఈత చెట్లు, ఇస్త్రీ పెట్టెలు కేసీఆర్ ఇచ్చి మా మనోభావాలు దెబ్బ తీయలేదా అని ప్రశ్నించారు. బీసీ నాయకుడు వీర్లపల్లి శంకర్‌కు అండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు నర్సింహ, నరేష్, మల్లేష్, కృష్ణ, లక్ష్మణ్, సత్యం, శేఖరప్ప, రాజేందర్, అశోక్‌గౌడ్, రాజు,పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పద్మావతి ఆర్ట్ అకాడమీ, సూత్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువు కార్నతి కిరణ్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో మోదమున, వినాయకకౌతం, పుష్పాంజ లి, హిమగిరితనయే, కొలువై ఉన్నదే, జతిస్వరం, దశావతారం, పలుకే బంకారమాయెనా, థిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళాకారులు వేదం, సహస్ర పాల్గొన్నారు.



